క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

దువ్వూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ సభాభవనంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. మండల స్థాయి అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికలతో సమావేశానికి రావాలని ఆమె పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

నేడు ఉపకార వేతనాలు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక కొర్రపాడు రోడ్డులోని కేసీ పుల్లయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు కేసీ పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేసీ పుల్లయ్య వర్ధంతి సందర్భంగా ఉపకార వేతనాలను పంపిణీ చేస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ కె.అనిల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మినిస్ట్రీ ఆఫ్ జల్‌శక్తి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా స్పెషల్ చీఫ్ సెక్రటరీ అండ్ డైరెక్టర్ జనరల్ అశోక్‌కుమార్, సీనియర్ పబ్లిక్ హెల్త్ స్పెషలిస్టు డాక్టర్ సంతోష్‌కుమార్, డాక్టర్ చంద్రశేఖర్, ఋషిహుడ్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ శోభిత్ మాథుర్, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్ తదితరులు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

31న చిత్ర లేఖన పోటీలు

చాపాడు: స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 31న చిత్ర లేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు. మూడు విభాగాల్లో 1 నుంచి 9వ తరగతి వరకూ విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు నగదుతో పాటు బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 27 లోగా సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో రూ.500, రూ.400, రూ.300ల చొప్పున ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 8500857111, 850086111 నంబర్లను సంప్రదించాలని చైర్మన్ కోరారు.

ఆదర్శప్రాయుడు తిరుపతిరెడ్డి



నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

పోరుమామిళ్ల: బద్వేలు ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన కామ్రేడ్ కల్లూరు తిరుపతిరెడ్డి నేటితరం కమ్యూనిస్టులకు ఆదర్శప్రాయుడని ఆ పార్టీ నేతలు కొనియాడారు. గురువారం తిరుపతిరెడ్డి 9వ వర్ధంతిని పురస్కరించుకొని రాజాసాహెబ్‌పేటలో ఆయన స్థూపం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళి అర్పించారు. తిరుపతిరెడ్డి తెలుగుగంగ ప్రాజెక్టు కోసం, రైతాంగ సమస్యల పరిష్కారానికి భూస్వాములకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేశారని నాయకులు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు వీరశేఖర్, ఏరియా కార్యదర్శి జకరయ్య, సహాయ కార్యదర్శి చంద్రమోహన్‌రాజు, పట్టణ కార్యదర్శి పిడుగు మస్తాన్, నాయకులు కేశవ, సుబ్బారెడ్డి, జాకోబ్, బాలు, నాగేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్.. కేసు నమోదు



నాటుసారాతో పట్టుబడిన వ్యక్తితో ఎస్ఐ

అట్లూరు: మండలంలోని వేమలూరు సగిలేరు వంతెన వద్ద నాటుసారాతో వెళ్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్ఐ కె.సి.రాజు తెలిపారు. పక్కా సమాచారంతో సారాతో వెళ్తున్న సి.కె.దిన్నె మండలం జమాల్‌పల్లె గ్రామానికి చెందిన సిగె వెంకటయ్యను గురువారం అదుపులోకి తీసుకొని 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామని ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

మండల పరిధిలోని జాండ్లపల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని గురువారం అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3500లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.సి.రాజు తెలిపారు. గ్రామ సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'గేట్'లో సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ



వినయ్

చాపాడు: అఖిల భారత స్థాయిలో నిర్వహించే గేట్ పరీక్ష ఫలితాల్లో స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కాలేజీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కరస్పాండెంట్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు. ఫైనలియర్ ఈసీఈ విభాగానికి చెందిన వినయ్ 2,445, ఎస్.సుష్మ 2,549 ర్యాంకులను సాధించారు. విద్యార్థులు సాధించిన ఫలితాల పట్ల సీబీఐటీ యాజమాన్యం, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

సస్యరక్షణలో డ్రోన్లు





కొర్రపంటలో డ్రోన్‌తో మందును పిచికారి చేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్) మందు పిచికారి చేసే డ్రోన్

రాజుపాళెం : తీవ్ర సంక్షోభంలో ఉన్న వ్యవసాయాన్ని బయటపడేయాలి. రైతులు సేద్యం చేసి ఉరేసుకొనే పరిస్థితి మారాలి. దీనికి ఆధునిక వ్యవసాయం ఒక్కటే పరిష్కారం. దీని కోసం సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వ్యవసాయంలో రానురాను అనేక మార్పులు వస్తున్నాయి. కూలీలతో అవసరం లేకుండా యంత్రాలతో ఇప్పటికే చాలా మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారు. సమయానికి కూలీలు దొరకకపోవడం, దొరికినా అధికంగా కూలి ఉండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కొర్రపంటపై డ్రోన్‌తో పురుగు మందులు పిచికారి చేస్తున్నారు. ట్రాక్టర్, కూలీలతో అయితే పంట దెబ్బతినడంతో పాటు అధికంగా ఖర్చు అవుతుందని భావించిన రైతులు డ్రోన్‌తో మందు పిచికారి చేస్తున్నారు. డ్రోన్‌తో అయితే ఎకరాకు రూ.500 అవుతుందని, తక్కువ మందు ఖర్చుతోపాటు సమయం ఆదా అవుతుందని తెలిపారు. కొర్రపంటపై డ్రోన్‌తో మందు పిచికారి చేసే సమయంలో ఆదారిలో వెళ్లే వారంతా కాసేపు ఆగి చూసి వ్యవసాయంలో చాలా మార్పులు వచ్చాయని అంటున్నారు.

ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏం అభివృద్ధి చేశావు?

'వరద'ను ప్రశ్నించిన బంగారు మునిరెడ్డి



ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని పాతికేళ్ల పాటు ప్రొద్దుటూరు ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించిన రోజుల్లోనే చేయని అభివృద్ధి ఇప్పుడేం చేస్తారని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ప్రశ్నించారు. మున్సిపాలిటీ పరిధిలోని 41వ వార్డు కౌన్సిలర్ గంజికుంట రామసుబ్బమ్మ ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సతీమణి రాచమల్లు రమాదేవి ఎన్నికల ప్రచారం చేస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ వరదరాజులరెడ్డి వయసును కించపరచలేదన్నారు. వయసు అనేది అందరికి సర్వసాధారణంగానే పెరుగుతుందన్నారు. అన్ని అవకాశాలు ఉన్న రోజుల్లోనే వరదరాజులరెడ్డి నియోజకవర్గ అభివృద్ధి గురించి పట్టించుకోలేదని, ఈ వయసులో ఆయన ఏం అభివృద్ధి సాధించగలరని ప్రశ్నించారు. 41వ వార్డులో రూ.కోటి అభివృద్ధి పనులు చేశామని, రూ.28 కోట్ల సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామన్నారు. యువనాయకుడు రాచమల్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జి గంజికుంట అంజనేయులు, 38వ వార్డు ఇన్‌చార్జి పల్లా సురేష్, రాముడు, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, 40వ వార్డు ఇన్‌చార్జి నాగేంద్ర, మాజీ జెడ్పీటీసీ రామలక్ష్మి సుబ్బయ్య, ఆటో నగర్ నన్నేసాహెబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రంగారెడ్డి, సుబ్బయ్య, కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జి బాల, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు చౌడం రవిచంద్ర, ఉప్పర మురళి, తుపాకుల వెంకటరమణ, రాగా నాగలక్ష్మి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. కాగా.. వలంటీర్ ధనుంజయ తన పదవికి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరాడు. పార్టీ విజయం కోసం పనిచేస్తున్నానని తెలిపాడు.

కౌన్సిలర్ ఆయనే.. పార్టీ అదే



నంద్యాల వరదరాజులరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన కౌన్సిలర్ మహ్మద్ గౌస్

ప్రొద్దుటూరు: మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు కౌన్సిలర్ వైఎస్ మహ్మద్ గౌస్ తొలి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉండేవారు. పార్టీ విధానాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారని ఆయనను చాలా రోజుల క్రితమే పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. సస్పెండ్ చేసిన తర్వాత టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ముందుగా కలిశారు. అనంతరం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్‌ను కలిసి టీడీపీ కండువా కప్పించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి బుధవారం గౌస్ ఇంటికి వెళ్లి మరో మారు కండువా కప్పారు. అదే కౌన్సిలర్‌కు అదే పార్టీ కండువాను ఎన్ని మార్లు వేస్తారని స్థానిక నేతలు చర్చించుకుంటున్నారు.

నేటి నుంచి కోటపోలేరమ్మ తిరుణాల

పోరుమామిళ్ల: పట్టణంలోని రంపాడురోడ్‌లో వెలసిన కోట పోలేరమ్మ తిరుణాల ఈ నెల 22, 23, 24 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. శుక్రవారం ఉదయం అమ్మవారికి మహిళలు పట్టువస్త్రాల సమర్పిస్తారని తెలిపారు. 23న శనివారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహిస్తారని, రాత్రికి భజన కార్యక్రమం ఉంటుందన్నారు. ఆదివారం బలిజకోట నుంచి కుంకుమబండి, గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

మేలు చేసే వారికే ఓటేయండి



ప్రచారం చేస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల: అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు అమలు చేసి మేలు చేసేవారికే ఓటు వేయాలని పీఆర్ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు రాజశేఖర్ కోరారు. గురువారం సాయంత్రం మండలంలోని గానుగపెంట పంచాయతీ కొట్టాలపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతుందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగల్‌విండో అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, సర్పంచ్ వీరభద్రుడు, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి బాబు, డాక్టర్ మాబు, నాయకులు వెంకటయ్య, రమణయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ వ్యక్తిత్వం భవితకు ముఖ్యం



జ్యోతి ప్రజ్వలనలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సిద్ధేశ్వరరావు, అధ్యాపకులు

ప్రొద్దుటూరు: మనిషి సమాజంలో ఎంత ఎత్తుకు ఎదిగినా ఉత్తమ వ్యక్తిత్వం కలిగి ఉండడం ముఖ్యమని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ వెన్నపూస బ్రహ్మానందరెడ్డి వ్యాఖ్యానించారు. స్థానిక వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ మనం విచారంగా ఉంటే మన జీవితం పరిహాసం చేస్తుందని, మనం సంతోషంగా ఉంటే జీవితం చిరునవ్వు చిందిస్తుందన్నారు. మన సంతోషం ఇతరులకు పంచితే జీవితం సలామ్ చేస్తుందని చెప్పారు. మిమ్మల్ని మీరు ఎవరితోనూ పోల్చుకోవద్దని, అలా చేస్తే మిమ్మల్ని మీరు అవమానించుకున్నట్లేనని పేర్కొన్నారు. పరిష్కారం లేని సమస్యలు ఉండవని, ప్రతి సమస్యకి పరిష్కారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సిద్ధేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ ఎం.రజనీకాంత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు రామాంజనేయరెడ్డి, ఎం.శ్రీనివాసులు, హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న ఆర్ఓ

బ్రహ్మంగారిమఠం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తామని మైదుకూరు రిటర్నింగ్ అధికారి చంద్రమోహన్ తెలిపారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌లను గురువారం సాయంత్రం ఆర్ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ బూత్‌లలో అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, బీఎల్ఓలు, వీఆర్వోలు, ఆర్ఐ కాశీ విశ్వనాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

అడవులతోనే జీవన మనుగడ



అడవుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన అధికారులు

బద్వేలు అర్బన్: అడవులతోనే జీవన మనుగడ కొనసాగుతుందని, అందుకోసం అటవీ ప్రాంతాన్ని సంరక్షించడానికి ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఇన్‌చార్జి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కె.వెంకటశేషయ్య పేర్కొన్నారు. ప్రపంచ అడవుల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక సాయివిద్యానికేతన్ స్కూల్‌లో విద్యార్థులకు అడవుల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం ప్రతిఒక్కరూ అడవులను రక్షించాలని పిలుపునిచ్చారు. వాతావరణంలో జరుగుతున్న అనేక మార్పులకు అడవులు అంతరించిపోతుండటమే ముఖ్య కారణమని, అందువల్ల ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు అడవుల సంరక్షణకు కృషి చేయాలని కోరారు. అలాగే వన్యప్రాణులను కూడా సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ఖాజావలి, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో ఎన్నికల విధులా?

రాజుపాళెం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో, స్టిక్కర్లను తమ సొంత ఇంటికి అతికించుకుంటే ఎన్నికల నిబంధనలకు విరుద్ధమా అని వెంగళాయపల్లె గ్రామ సర్పంచ్ ధనిరెడ్డి రేణుకమ్మ ప్రశ్నించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం అర్ధరాత్రి తన కుమార్తె ఇంటి వద్ద నిద్రిస్తున్న సమయంలో ఎన్నికల అధికారులంటూ తమకు నిద్ర భంగం కలిగించడమేగాకుండా ఇంటికి అతికించిన స్టిక్కర్‌ను తొలగించాలని వారు హడావుడి చేశారని తెలిపారు. రాత్రి సమయంలోనే ఎన్నికల అధికారులు జగనన్న ఫొటో ఉన్న స్టిక్కర్‌ను తొలగించారన్నారు. ఇంటికి ఉన్న స్టిక్కర్‌ను తొలగించాలని ఎన్నికల నిబంధనలు ఏమైనా ఉంటే తమకు చూపించి పగటిపూట ఎన్నికల అధికారులు స్టిక్కర్‌ను తొలగించాలన్నారు. రాత్రి సమయంలో ఇలా హడావుడి చేయడం సరైంది కాదన్నారు. ఈ ఘటనపై ప్రొద్దుటూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. మహిళలని చూడకుండా రాత్రి సమయంలో జరిపే ఎన్నికల తనిఖీ వల్ల ఏమి జరిగేది అర్థం కావడం లేదన్నారు. ఒక గ్రామ సర్పంచ్ ఇంటి వద్దనే ఇలా చేస్తే సామాన్య ప్రజల ఇబ్బందులను గమనించాలని అన్నారు.

జగనన్నను గెలిపించుకుందాం



సీతానగరంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఖాజీపేట: కష్టాకాలంలో ప్రజలకు అండగా ఉండి.. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి కోరారు. మేము సిద్ధం, మా పోలింగ్ బూత్ సిద్ధం కార్యక్రమాన్ని కూనవారిపల్లె పంచాయితీ సీతానగరం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్నను తిరిగి సీఎంగా గెలిపిస్తే ప్రజలకు మరింత మేలు చేస్తారని అన్నారు. అనంతరం గ్రామంలో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, కూనవారిపల్లె నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సంక్షేమం సాధ్యం



ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

కొండాపురం : రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ప్రొద్దుటూరు ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ తెలిపారు. గురువారం మండలంలోని యర్రగుడి పునరావాస కేంద్రంలో ఆయన పర్యటించి ఇంటింటికి తిరుగుతూ కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. గతంలో టీడీపీ నాయకులు తప్పుడు హామీలు చెప్పి అమలు చేయలేకపోయ్యారన్నారు. సీఎం జగనన్న ఎన్నికల సమయంలో చెప్పిన ప్రతి హామీని అమలు చేశాడన్నారు. రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే మరోసారి వైఎస్ జగనన్నను సీఎం చెసుకుందామని ప్రజలతో ఆయన కోరారు. పింఛన్లు ఇంటి వద్దకే పంపిణీ కొనసాగాలంటే అవ్వతాతలు తప్పకుండా ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా కమిటీ చైర్మన్ ఒంటిద్దు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మినారాయణరెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కమిటీ కార్యదర్శి అల్లం సత్యం, డీలర్ పి.సుధాకర్‌రెడ్డి, కోడూరు శివన్న, దాది శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అల్ షిఫా కేంద్రం వ్యవస్థాపకుడు మహమ్మద్ రఫీ

కడప కల్చరల్ : పిల్లలు మానసిక వికలాంగులుగా పుట్టేందుకు కారణమవుతున్న డౌన్ సిండ్రోమ్ పట్ల తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని అల్ షిఫా కేంద్రం వ్యవస్థాపకులు మహమ్మద్ రఫీ తెలిపారు. గురువారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా కడప నగరం పాత రిమ్స్‌లోని అల్ షిఫా కేంద్రంలో తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ డౌన్ సిండ్రోమ్ అనేది క్రోమోజోమ్ సాధారణ పరిస్థితి వల్ల ఏర్పడుతుందన్నారు. మానవ శరీరంలో 21 జతల క్రోమోజోములకు అదనంగా ఒక క్రోమోజోమ్ ఉంటే డౌన్ సిండ్రోమ్ పుట్టే అవకాశాలు ఉన్నాయన్నారు. డౌన్ సిండ్రోమ్ భౌతిక లక్షణాలను బాదం ఆకారంలో కళ్లు, చిన్న మెడ, చిన్న చెవులు, నోటిలో నుంచి బయటికి వచ్చేలా ఉండే నాలుక, చిన్న చేతులు, కాళ్లు, పిల్లలు, పెద్దలు ఎత్తు తక్కువగా ఉండడంగా చెప్పవచ్చన్నారు. 700 మంది శిశువులలో ఒకరికి ఈ సమస్య వస్తుందని, సాధారణంగా గర్భధారణ సమయంలో 35 ఏళ్ల కంటే ఎక్కువ వయసు ఉన్న తల్లులకు డౌన్ సిండ్రోమ్ పిల్లలు జన్మిస్తారన్నారు. గర్భధారణ సమయంలో జాగ్రత్తగా ఉండాలని, వీలైనంత వరకూ మేనరికపు వివాహాలకు దూరంగా ఉండాలన్నారు.

రక్తదానం చేసిన రామతులసి

పోరుమామిళ్ల: వివేకానంద సేవాశ్రమ నిర్వాహకురాలు రామతులసి గురువారం 5వ సారి రక్తదానం చేసి ఔదార్యం చాటుకున్నారు. కవలకుంట్లకు చెందిన శేషమ్మకు అధికంగా రక్తస్రావమవడంతో.. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గర్భసంచికి శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు తెలిపారు. ఆపరేషన్‌సమయంలో రక్తం కావాలని వైద్యులు సూచించడంతో కుటుంబసభ్యులు రామ తులసిని సంప్రదించారు. దీంతో ఆమె రక్తం ఇచ్చి ఆదుకున్నారు. పలువురు రామతులసిని అభినందించారు.

మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

వైవీయూ : పదో తరగతి మూల్యాంకన విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు సౌకర్యాలు కల్పించాలని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) కడప జిల్లాశాఖ కోరింది. గురువారం కడప నగరంలోని డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఎం.అనూరాధాను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి మూల్యాంకన విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. 58 ఏళ్ల దాటిన ఉపాధ్యాయులు, గర్భవతులు, చిన్నపిల్లల తల్లులు, అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మూల్యాంకనం నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీరు, మజ్జిగ సరఫరా చేయాలని, చలువ పందిర్లు, ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలని కోరారు. విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రవికుమార్, గోపీనాథ్, బి.చంద్రశేఖర్, పి.చంద్రశేఖర్, వై.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణకు హోమియోలో మందులు



విద్యార్థులకు హోమియో మందులు మింగిస్తున్న డాక్టర్ షాకీర్‌హుసేన్

కమలాపురం : వడదెబ్బ నివారణకు హోమియోలో మందులు ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ హోమియో వైద్యాధికారి షాకీర్ హుసేన్ తెలిపారు. గురువారం పట్టణ పరిధిలోని కె.అప్పాయపల్లెలో ఉర్దూ, తెలుగు ప్రాథమిక పాఠశాల్లో హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులందరికి వడదెబ్బ నివారణకు నాట్రమ్ మురియాటికం-200 మింగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడదెబ్బ నివారణకు హోమియోలో అద్భుత మందులు ఉన్నాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎండల్లో తిరిగే వారు, ఉపాధి కూలీలు ఈ మందులను వినియోగించు కోవాలన్నారు. వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వదులుగా ఉన్న నూలు దుస్తులు ధరించాలన్నారు. ఉదయం 11 గంటలకే ఇంటికి చేరుకోవాలని, సాయంత్రం 5 గంటల వరకు బయటకు రావద్దన్నారు. అలాగే మజ్జిగ, నన్నారి, నీళ్ల ఎక్కువగా తాగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, హోమియో సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో అన్నివర్గాలకు ప్రాధాన్యత



వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : జగనన్న ప్రభుత్వంలో అన్నివర్గాలవారికి ప్రాధాన్యత లభిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డిలు తెలిపారు. గురువారం మైలవరం మండలంలోని దొమ్మరనంద్యాల, తొర్రివేముల, గంగుల నారాయణపల్లె గ్రామాల్లో పలువురు రామసుబ్బారెడ్డి వర్గీయులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ పార్టీలో చేరారు. అనంతరం వారు విస్తృతంగా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. దేశ చరిత్రలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, క్రిస్టియన్ లకు సమానంగా పదవులు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను అమలు పరచిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలు అందాయన్నారు. చేనేత కార్మికులు పడుతున్న కష్టాలను చూసి వారికి 50 సంవత్సరాలకు పింఛన్, నేతన్న నేస్తం పథకం కింద ప్రతి ఏడాది రూ.24 వేలు వారి ఖాతాల్లో వేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఏకమై వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డిలను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి చంద్రబాబు, పవన్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు తగిన బుద్ధిచెప్పాలని వారు పిలుపునిచ్చారు.

50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక..

మైలవరం మండలం పి.రామసుబ్బారెడ్డి వర్గీయులైన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తొర్రివేముల గుర్విరెడ్డితో పాటు తొర్రివేముల గ్రామానికి చెందిన 20 కుటుంబాలు అలాగే గంగుల నారాయణపల్లె గ్రామంలోని చిన్న గురువయ్య, గురుమోహన్‌రెడ్డి, గురుశేఖర్, చిన్న నాగుషితో పాటు మరో 30 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జమ్మలమడుగు ఎన్నికల కన్వీనర్ సంబటూర్ ప్రసాద్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు భీమునిపల్లె రామయ్య, మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వర్‌రెడ్డి, బీసీ రాష్ట్ర చేనేత నాయకుడు బడిగించల చంద్రమౌళి, యనమల వేణుగోపాల్‌రెడ్డి, జయరామిరెడ్డి, ఆదాం, హజీబాషా, సుబ్బయ్య, గుర్విరెడ్డి, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వ్యక్తిత్వం భవితకు ముఖ్యం

ప్రొద్దుటూరు : మనిషి సమాజంలో ఎంత ఎత్తుకు ఎదిగినా ఉత్తమ వ్యక్తిత్వం కలిగి ఉండడం ముఖ్యమని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ వెన్నపూస బ్రహ్మానందరెడ్డి వ్యాఖ్యానించారు. స్థానిక వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ మనం విచారంగా ఉంటే మన జీవితం పరిహాసం చేస్తుందని, మనం సంతోషంగా ఉంటే జీవితం చిరునవ్వు చిందిస్తుందన్నారు. మన సంతోషం ఇతరులకు పంచితే జీవితం సలామ్ చేస్తుందని చెప్పారు. మిమ్మల్ని మీరు ఎవరితోనూ పోల్చుకోవద్దని, అలా చేస్తే మిమ్మల్ని మీరు అవమానించుకున్నట్లేనని పేర్కొన్నారు.